


సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో ఓటు వేసి వస్తున్న గులాబీ అధినేత కేసీఆర్, సతీమణి శోభ



హైదరాబాద్ నందినగర్‌లో సతీమణి, కుమారుడితో కలిసి ఓటు వేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సిద్దిపేటలో కుటుంబ సమేతంగా ఓటు వేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

## కేంద్రంలో ప్రాంతీయ పార్టీలదే పెత్తనం

### బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. చింతమడకలో ఓటు హక్కు వినియోగం

సిద్దిపేట/సిద్దిపేటరూరల్, మే 13: లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాదని ప్రాంతీయ పార్టీలదే పెత్తనం నడుస్తుందని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలంలోని చింతమడకలో సోమవారం కేసీఆర్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలంతా ఉత్సాహంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. 65 శాతానికిపైగా ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ఫలితాల అనంతరం కాంగ్రెస్, బీజేపీ కూటమికి సరైన మెజార్టీ రాదని, దేశంలో ప్రాంతీయ పార్టీలు కీలక పాత్రను పోషించే అవకాశం ఉందని తెలిపారు. రాబోయేరోజుల్లో బీఆర్‌ఎస్ కేంద్రంలోనూ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో గొప్ప ఫలితాలు

### పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో అద్భుతమైన పోరాటపటిమ ప్రదర్శించిన బీఆర్‌ఎస్ శ్రేణులు, పార్టీ నాయకులు, సోషల్ మీడియా వారియర్లకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తిరిగి బలంగా నిలబడి కొట్లాడటం ఆషామాషీ వ్యవహారం కాదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుతమైన నిబద్ధతతో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ వెంట నడిచి కొట్లాడిన తీరు అద్భుతం అన్నారు. తెలంగాణ మీద ఉన్న ప్రేమ కేసీఆర్‌పైన ఉన్న అచంచలమైన విశ్వాసంతో తమ పార్టీ కార్యకర్తలు తమ వాణిని బలంగా వినిపించి, అద్భుతంగా కొట్లాడారని కొనియాడారు. తమ పార్టీ శ్రేణులు చేసిన ఈ పోరాటం గొప్ప ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు.

## కార్యకర్తల సేవలు వెలకట్టలేనివి

### మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ)/ సిద్దిపేట : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబిటాస్ స్కూల్‌లోని 114వ పోలింగ్ కేంద్రంలో ఆయన సతీమణి శ్రీనిత, కుమారుడు అర్చిష్‌మాన్ రావుతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సేవలు వెలకట్టలేనివని ట్వీట్ చేశారు. 'బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించడానికి నిర్విరామంగా పనిచేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షంగా ప్రజలతో సంబంధం కలిగి ఉండి, అంకితభావంతో మీరు పడిన కష్టం, తపన నాతోపాటు అందరికీ స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.

# ప్రశాంతంగా పోలింగ్

మొదటిపేజీ తరువాయి...

ఉన్నది. హైదరాబాద్ నియోజకవర్గంలో అతి తక్కువగా 44.91% పోలింగ్ నమోదు కాగా, సికింద్రాబాద్‌లో 47.49% నమోదైంది. ఖమ్మంలో అత్యధికంగా 75.19% ఓటింగ్ నమోదైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 62.77% ఓటింగ్ నమోదు కాగా, ఈసారి దానిని అధిగమించడం విశేషం. ఈ సంవత్సరం ఎండలు తీవ్రంగా ఉండటంతో పోలింగ్‌పై ప్రభావం చూపుతుందనే ఉద్దేశంతో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయం పొడిగించారు. అయితే, వాతావరణం అనూహ్యంగా చల్లబడటంతో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉంటుందన్న అంచనాతో ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. దీంతో ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున క్యూలైన్లు దర్శనమిచ్చాయి. అయితే, సాయంత్రం వరకు కూడా సాధారణ ఎండలు మాత్రమే ఉండటంతో ఓటింగ్ శాతం పెరిగిందని విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ సహా ఉత్తరాది రాష్ట్రాలకు లక్షలాది మంది తరలివెళ్లినా పోలింగ్ శాతం పెరగడం అభ్యర్థులను, రాజకీయ పార్టీలు, ఎన్నికల సంఘం అధికారులకు ఊరటనిచ్చింది. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాధవీలత, నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిపై కేసులతోపాటుగా మొత్తం 38 ఎఫ్‌ఐఆర్‌లు సోమవారం ఒక్క రోజే నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 115 ఈవీఎంలు వివిధ కారణాలతో మొరాయించడంతో వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజు సోమవారం ఎన్నికల అక్రమాలపై సీ-విజిల్ యాప్‌కు 225 ఫిర్యాదులు, డయల్ 1950 ద్వారా 21 ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి అందాయి. రాష్ట్రంలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాలేదని, రీ పోలింగ్ జరపాల్సిన అవసరం ఏర్పడలేదని ఎన్నికల అధికారులు తెలిపారు. రాష్ట్రంలో నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం రాలేదు.



సోమవారం నల్లగొండ జిల్లా రాములబండలో ఓటేసేందుకు పోటెత్తిన జనం

### సీఈవో వికాస్‌రాజ్ పర్యవేక్షణ

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సోమవారం ఉదయం నుంచి బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ నిత్యం పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా ఓటింగ్ తీరును పరిశీలిస్తూ, జిల్లా అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఓటింగ్ శాతం సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేశారు.

## 20 రోజులు ఎదురుచూపులే!

### జూన్ 4న ఓట్ల లెక్కింపు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కోసం 20 రోజులపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. దేశవ్యాప్తంగా జూన్ 4న మంగళవారం ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. తెలంగాణలో లెక్కింపు కేంద్రాలలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేయనున్నారు. 500 పోలింగ్ కేంద్రాల కంటే ఎక్కువ ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో టేబుల్స్ సంఖ్య పెరుగుతుంది. ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపుతో పాటు 500 పోస్టల్ బ్యాలట్ ఓట్లకు ఒక టేబుల్‌ను అదనంగా ఏర్పాటు చేయనున్నారు. వివిధ ప్రాంతాల్లో పోలైన పోస్టల్ బ్యాలట్‌లను ఆయా నియోజకవర్గపు రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో భద్రపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా 44 కేంద్రాల్లో ఓట్లను లెక్కించనున్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద కేంద్ర బలగాల బందోబస్తుతోపాటు సీసీ కెమెరాలు, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో నిరంతరం పర్యవేక్షిస్తారు.

## హాలిడే మూడ్‌లో లీడర్లు

### ఫలితాల టెన్షన్ నుంచి ఉపశమనం కోసం ట్రిప్స్

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): లోక్‌సభలో ఎన్నికల ప్రజా తీర్పు భద్రంగా ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ప్రజలు ఎవరిని తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారో తెలియాలంటే మరో మూడు వారాలు ఆగక తప్పదు. కనీసం ఎగ్జిట్ పోల్స్ తెలియాలన్నా.. జూన్ 1వ తేదీ వరకు ఆగాల్సిందే. మరోవైపు ఇన్నాళ్లు ప్రచార హడావుడి, మైకుల హోరు, రోడ్ షోలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఓటర్లు.. ఇలా ప్రతిక్షణం హడావుడిగా గడిపిన అభ్యర్థులు, నాయకులు ఇప్పుడు సేదతీరేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు నేతలు విదేశాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఉదాహరణకు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఈ నెల 17 నుంచి ఐరోపా పర్యటనకు వెళ్లాలని భావిస్తున్నారు.మరికొందరు నేతలు దేశంలోనే ఇతర పర్యాటక ప్రాంతాల్లో రెండుమూడు వారాలు గడిపేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇంకొందరు ఎలాంటి హడావుడి లేకుండా తమ ఇండ్లు, ఫామ్‌హౌజ్‌లకే పూర్తిస్థాయిలో పరిమితం కావాలని భావిస్తున్నారు. ఒకటి రెండు వారాలపాటు కలవడానికి కూడా ఎవరూ రావొద్దని ఆదేశిస్తున్నారు. గ్రామ, మండల స్థాయి లీడర్లు ఇప్పటికే ఎండల నుంచి ఉపశమనం పొందేలా సేదతీరేందుకు శీతలప్రాంతాల విడిదులను వెతుక్కుంటున్నారు.

## ఉడకని అన్నం.. తలుపులు లేని టాయిలెట్లు

### కనీస వసతులు లేక ఎన్నికల సిబ్బంది ఇక్కట్లు

జనగామ చౌరస్తా, మే 13: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రిసైడింగ్ అధికారులు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు(ఏపీవో), అదర్ ప్రిసైడింగ్ అధికారులు (ఓపీవో)తో పాటు రిజర్వ్‌లో ఉన్న ఎన్నికల సిబ్బంది జనగామ నియోజకవర్గం పరిధిలో అసౌకర్యాల నడుమ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో రిజర్వ్‌లో ఉన్న 80మంది సిబ్బందికి మధ్యాహ్నం 2 గంటలలోపు లంచ్ పెట్టాల్సి ఉండగా, 3.30గంటల వరకు కూడా భోజనం పెట్టకపోవడంతో ఆకలితో అలమటించారు. చివరికి భోజనం ఏర్పాటు చేశారని, సరిగా ఉడికి ఉడకని అన్నం, కూరలను అందించారని ఆవేదన వ్యక్తం చేశా రు. మెనూ ప్రకారం ప్రతి గంటకు ఒకసారి మజ్జిగ, స్నాక్స్ అందించాల్సిన ఉన్నా కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని, ఈఆర్వోగా ఉన్న ఆర్డీవో కొమురయ్య దృష్టికి తీసుకెళ్లిన స్పందించలేదని ఆవేదన వెలిబుచ్చారు. మహిళా ఉద్యోగులకు టాయిలెట్స్ సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో ఉండడానికి సరైన వసతులు, కరెంట్ లేకపోవడంతో లాడ్జీలు అద్దెకు తీసుకొని ఉన్నట్టు ఉద్యోగులు పేర్కొన్నారు.



## పోలీసుల సేవలకు హ్యాట్సాఫ్

### మీడియాతో డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు విశేష కృషి చేశారని, కోడ్ వచ్చినప్పటి నుంచి పోలింగ్ వరకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించినందుకు హ్యాట్సాఫ్ చెబుతున్నట్టు డీజీపీ రవిగుప్తా తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సజావుగా, శాంతియుతంగా జరిగినట్టు వెల్లడించారు. మావోయిస్టు ప్రాంతాల్లో రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలు విస్తృతంగా చేపట్టిన తనిఖీల వల్ల ఎలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోలేదని తెలిపారు. కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికలు ముగిసే వరకూ మొత్తం రూ.191కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. ఇందులో నగదు రూ.98.82 కోట్లు, రూ 10.81 కోట్ల మద్యం, రూ.7.11 కోట్ల డ్రగ్స్, రూ.62.77 కోట్ల ఆభరణాలు, రూ.11.65 కోట్ల విలువైన ఉచితాలు ఉన్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్స్ ఏడీజీలు సంజయ్ కుమార్ జైన్, మహేశ్ భగవత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఉపఎన్నిక బరిలో 52 మంది

### 63 మందిలో 11 మంది నామినేషన్లు ఉపసంహరణ

నల్లగొండ, మే 13: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 52 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 69 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. ఈనెల 10న ఆరుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 63 మందిలో 11 మంది సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దాంతో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

# పలు గ్రామాల్లో పోలింగ్ బహిష్కరణ

- బ్యాటరీ కంపెనీ ఏర్పాటుతో ప్రాణాలకు ముప్పు ఉందని నాలుగు గ్రామాల ప్రజలు..
- తాగునీరు, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యం లేదని తండావాసులు
- కాంగ్రెస్ నాయకుడు అవమానించాడని మహిళలు
- పలు కారణాలతో నిరసనలు
- అధికారులు నచ్చజెప్పడంతో కొనసాగిన ఓటింగ్

పాలమూరు/ఇందల్వాయి/ నిజాంసాగర్/ కందుకూరు/రామారెడ్డి, మే 13: సమస్యలు పరిష్కరించాలని పలు గ్రామాలు ప్రజలు సోమవారం లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బ్యాటరీ కంపెనీ ఏర్పాటుతో తమ ప్రాణాలకు ప్రమాదం ఉందని, పనులు నిలిపివేయాలని నాలుగు గ్రామాల ప్రజలు, తమ గ్రామ పరిధిలో కాకుండా వేరే చోట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారని కొందరు, తాగునీరు, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యం, కనీస వసతులు లేవని మరికొందరు, కాంగ్రెస్ నాయకుడు కించపరిచాడని మహిళలు ఇలా పలు కారణాలతో ప్రజలు రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను మధ్యాహ్నం వరకు బహిష్కరించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఓటు వేయడానికి అంగీకరించారు. వివరాల్లోకి వెళ్తే... మహబూబ్‌నగర్ జిల్లాకు సమీపంలో నిర్మిస్తున్న అమర్‌రాజ బ్యాటరీ కంపెనీ పనులు నిలిపివేయాలని ఎదిర, దివిటిపల్లి, అంబటిపల్లి, సిద్దాయపల్లి వాసులు పోలింగ్‌ను బహిష్కరించారు. బ్యాటరీ కంపెనీతో తమ ప్రాణాలకే ప్రమాదం ఉన్నదని, పనులు నిలిపివేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్దిచెప్పడంతో 3,299 మందికి130 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకొన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం చీమలవాణి కుంట గ్రామం, రాచులూరు పరిధిలో ఉండగా తిమ్మాపూరులో పోలింగ్ కేంద్రం ఎందుకు ఏర్పాటు చేశారని, తాము ఓటు వేయబోమని 400మంది గ్రామస్థులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం ఏసీపీ, కందుకూరు సీఐ మక్బూల్ జాని ఓటు వేయాల్సిందిగా చీమలవాణి కుంటవాసులకు విన్నవించారు. అయిన గ్రామస్తులు పట్టుపట్టి అక్కడే బైఠాయించారు. దీంతో అర్జున అవార్డుగ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి పోలీసులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి మరో ఎన్నికల్లోపు గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఓటు వేయడానికి అంగీకరించారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గ్రామపరిధిలోని రాంసాగర్‌తండాకు రోడ్డు సౌకర్యం లేదని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు మధ్యాహ్నం వరకు పోలింగ్ బహిష్కరించారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు తండాకు చేరుకొని ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు పోలింగ్ కేంద్రానికి కదిలారు. కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలంలోని పిప్పిరేగడి తండాలో తాగునీరు, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యం లేదని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్థులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, ఎస్సై సుధాకర్, మండల నాయకులు అక్కడికి చేరుకొని తండావాసులను సముదాయించారు. కనీస వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రెండు గంటల అనంతరం ఉదయం 11 గంటల తర్వాత ఓటు వేసేందుకు తండావాసులు తరలివచ్చారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట్‌లోని కొంతమంది మహిళలు ఓటు వెయ్యబోమని కాలనీలో బైఠాయించారు. ఓటు వెయ్యకపోతే ఒరిగేదేమీలేదని కాంగ్రెస్ నాయకుడు తమను అవమానించాడని ఓ వర్గం మహిళలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో మరోవర్గం కాంగ్రెస్ నాయకులు మహిళలను సముదాయించి ఓటు వేయించారు.



అమరగిరి చెంచుగూడెంలో నిరసన తెలుపుతున్న చెంచులు

## 2గంటలు నిలిచిన పోలింగ్

### కరెంట్‌ను పునరుద్ధరించాలని అమరగిరి చెంచుగూడెంలో నిరసన
### సమస్య పరిష్కరించిన తర్వాత ఓటింగ్

కొల్లాపూర్ రూరల్, మే 13 : విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించిన తర్వాతే ఓటేస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి చెంచుగూడెంలో చెంచులు రెండు గంటల పాటు పోలింగ్‌ను బహిష్కరించారు. గూడెంలోని 262 నంబర్ పోలింగ్ బూత్‌లో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్, 9 గంటలైనా మొదలుకాలేదు. ఇటీవల గాలిదుమారానికి చెట్టు విరిగిపడి కరెంట్ తీగలు తెగిపోవడంతో నాలుగు రోజులుగా గూడేనికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో తమకు విద్యుత్తును తిరిగి అందించేదాకా ఓటెయ్యబోమని చెంచులు భీష్మించుక్కూర్చున్నారు. తహసీల్దార్ శ్రీకాం త్, విద్యుత్తు అధికారులు గూడేనికి చేరుకొని కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. సమస్య పరిష్కారం కావడంతో చెంచులు ఓటేశారు.

## తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి

### యాదాద్రి కనుముక్కులలో రైతుల ఆందోళన

భూదాన్ పోచంపల్లి, మే 13: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని కనుముక్కులలో తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ సోమవారం రైతులు ధర్నా చేసి గంటపాటు ఎన్నికలను బహిష్కరించారు. ధర్నాతో ఉదయం 8 గంటల వరకు 43 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. రైతులు మాట్లాడుతూ కాంటా వేసిన ధాన్యాన్ని నాలుగు రోజులుగా తరలించకపోవడంతో వర్షానికి బస్తాలు తడిచి ముద్దయ్యాయని, మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 2,800 బస్తాల ధాన్యం ఉన్నదని, 20 రోజుల క్రితం వడ్లు తీసుకొచ్చినా నేటికీ కాంటా వేయలేదని, రవాణా సౌకర్యం కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ధాన్యం బస్తాలను తరలించేందుకు లారీలను పంపిస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించి ఓటింగ్‌లో పాల్గొనేందుకు అంగీకరించారు. ధర్నాలో వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, రైతులు పాక నరసింహ, నూకల లింగస్వామి, కొండల్‌రెడ్డి, కోట రామచంద్రారెడ్డి, చుక్క రవి, కొత్త లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో ఇద్దరి మృతి

- ఓటేసేందుకు వెళ్లి ముగ్గురు బలి
- పాముకాటుతో చికిత్స పొందుతున్న ఓ టీచర్
- పలు జిల్లాల్లో ఘటనలు, ఎన్నికల వేళ విషాదం

అశ్వారావుపేట టౌన్, చేర్యాల, ధర్పల్లి, మే 13 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో అక్కడక్కడ పలు విషాద ఘటనలు చోటుచేసుకొన్నాయి. ఓటు వేయడానికెళ్లిన ముగ్గురు, విధులు నిర్వర్తిస్తున్న మరో ఇద్దరు అస్వస్థతకు గురై, గుండెపోటుతో మృతిచెందారు. ఈ ఘటన ఆయా స్థానిక ప్రాంతాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. వివరాల్లోకెళ్తే.. ఖమ్మం నగరానికి చెందిన పోలూరి శ్రీకృష్ణ (50) భద్రాద్రి కొత్తగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఎన్నికల విధుల్లో భాగంగా అశ్వారావుపేట మండలం పేరాయగూడెం పంచాయతీ నెహ్రూనగర్ పాఠశాల (పోలింగ్ బూత్ నం.165)లో అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్(ఏపీవో)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం 9.45 గంటల సమయంలో ఛాతీలో నొప్పి రావటంతో సమీప ప్రభుత్వ దవాఖానకు తరలించగా, వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. అశ్వారావుపేట మండలపరిధి వేదాంతపురం గ్రామానికి చెందిన కాశీ నాగేశ్వరరావు (58) ఓటు వేయడానికి వచ్చి ఒక్కసారిగా అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలకేంద్రానికి చెందిన మహ్మద్ సాదిక్ (35) తన తల్లి మహమూదా అలీ (వీఆర్‌ఏ) ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆమె స్థానంలో డిచ్‌పల్లి సీఎంసీలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో గుండెపోటు రావటంతో వెంటనే ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అక్కడి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. సాదిక్‌కు ఎన్నికల విధులు కేటాయించలేదని, సీఎంసీకి వచ్చి మృతి చెందటం బాధాకరమని తహసీల్దార్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన ఇప్పకాయల సరోజన (75) అనే మహిళ పెద్దమ్మగడ్డ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి, బయటకొచ్చి కుప్పకూలిపోయింది. స్థానిక దవాఖాన వైద్యులు పరీక్షించి, గుండెపోటుతో మృతిచెందినట్టు ధ్రువీకరించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన దొంతు వీరమ్మ (55) స్థానికంగా ఓటు హక్కు వినియోగించుకొని ఇంటి దగ్గరికి రాగానే కింది పడి గుండెపోటుతో మృతిచెందింది. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో అందర్‌బంద్‌లోని పోలింగ్ బూత్‌లో విధులుకు వచ్చిన ఉపాధ్యాయుడు విపుల్‌రెడ్డిని పాము కాటు వేసింది. వెంటనే రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతున్నాడు.



సరోజన (ఫైల్)



సాదిక్ (ఫైల్)



పోలూరి శ్రీకృష్ణ (ఫైల్)



కాశీ నాగేశ్వరరావు (ఫైల్)



వీరమ్మ(ఫైల్)